క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



కాకాణితో మాట్లాడుతున్న నేదురుమల్లి

నెల్లూరు(బారకాసు) : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డైకస్‌రోడ్డులోని ఆయన క్యాంపు కార్యాలయంలో పార్టీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని రాజకీయ పరిస్థితులకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

సీలింగ్ ఫ్యాన్ల వితరణ



నెల్లూరు(అర్బన్) : కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ) ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని డీవీఎస్‌ఎం జెడ్పీ ఉన్నత పాఠశాలకు శుక్రవారం సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. పీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ తన తండ్రి వెంకటరమణయ్య పదో వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి చేతుల మీదుగా ఫ్యాన్లను అందించారు. కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు విజయగోపాల్, వేణుగోపాల్, మదిరి శ్రీదేవి, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, సాయి, హెచ్‌ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయుడు అచ్యుతమణి పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ మృతికి నివాళి

నెల్లూరు(అర్బన్) : గొట్టిప్రోలు పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బల్లి ప్రభాకర్ శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. దీంతో నెల్లూరులోని ఆయన నివాసానికి ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు వెళ్లి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటగోపాల్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న జేసీ కార్తీక్


నెల్లూరు రూరల్ : రీసర్వే సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కావలి, కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సర్వేయర్లతో జేసీ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేలో రైతుల పేర్లు తప్పుగా నమోదు కావడం, విస్తీర్ణంలో తేడా రావడం వంటి పలు రీసర్వే సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఉదయ భాస్కర్‌రావు, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, కావలి ఆర్డీఓ వంశీకృష్ణ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రుద్రాభిషేకం

నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో కార్తీక మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం రుద్రాభిషేకాలు, సామూహిక లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, పుష్పార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. చక్రాలవారి ట్రస్ట్ మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్రహ్మశ్రీ సీహెచ్.రామసుబ్రహ్మణ్యం కార్తీక మాస విశిష్టతను వివరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో చక్రాల ఆనందకుమార్, పవని అనిల్‌కుమార్, ఎం.లక్ష్మీనరసింహారావు, జి.ప్రభాకర్‌శర్మ, టి.శ్రీకాంత్ శర్మ, డాక్టర్ వై.సుదర్శన్‌రెడ్డి, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

ముస్లింల అన్నప్రసాద వితరణ

• మత సామరస్యాన్ని చాటిన మైనార్టీ నేతలు



నెల్లూరు(బృందావనం) : వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నేతలు అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసి మతసామరస్యాన్ని చాటారు. నగరంలోని కోటమిట్టలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం వద్ద వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, 48వ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిఖ్‌తో పాటు అలీ, రియాజ్, సందానిలు స్థానికంగా అయ్యప్ప భక్తులకు శుక్రవారం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో అస్లామ్, సురేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

అడిగేదెవరు.. అడ్డు చెప్పేదెవరు..

- నగరంలో టౌన్ సర్వీసుల ఇష్టారాజ్యం
- పర్మిట్ ఒక రూట్‌కు.. తిరిగేది మరో రూట్‌లో..
- నిత్యం ట్రాఫిక్‌కు కారణమవుతున్న ప్రైవేటు బస్సులు
- బస్సుల కండిషన్ అంతంత మాత్రమే



గాంధీ బొమ్మ సెంటర్‌లో రోడ్డు మధ్యలో జనాలను ఎక్కించుకుంటున్న బస్సు



ఆత్మకూరు బస్టాండ్ వద్ద రోడ్డుపైనే రిపేరు వచ్చి ఆగిపోయిన బస్సు

నగరంలోని టౌన్ బస్సుల నిర్వాహకులు తమను అడిగేదెవరు అన్నట్లు చెలరేగిపోతున్నారు. ఒక రూట్‌కు పర్మిట్ తీసుకుని మరో రూట్‌లో బస్సులను తిప్పుతున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. మితిమీరిన వేగం, కండిషన్‌లో వాహనం లేకపోవడం, హెవీ సౌండ్ హారన్లు, మిరుమిట్లు గొలిపే లైట్లతో ఇష్టానుసారంగా టౌన్ బస్సులను తిప్పేస్తున్నారు.

నెల్లూరు (టౌన్) : నగరంలో ఫుట్‌పాత్‌లు లేకపోవడం, ఇరుకు రోడ్లు, రోడ్డుపైనే పార్కింగ్‌లతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. ప్రధానంగా టౌన్ బస్సుల్లో అర్హత లేని కండక్టర్లు, డ్రైవర్లను పంపిస్తున్నారు. బస్సులో ప్రయాణికులను కూడా పరిమితికి మించి ఎక్కించి తిప్పుతున్నారు. మరో వైపు ఆయా బస్సులకు ఇచ్చిన సమయపాలనను పాటించకుండా ఎవరికి ఇష్టం వచ్చినప్పుడు తిప్పుతూ ఎక్కడపడితే అక్కడ ఎక్కువ సేపు బస్సులను నిలుపుతూ ట్రాఫిక్‌కు కారణమవుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన రవాణా, పోలీసు అధికారులు మామూళ్లు తీసుకుని మిన్నకుంటున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.

పాటించాల్సిన నిబంధనలు

రవాణా అధికారులు ఇచ్చిన పర్మిట్ ప్రకారమే బస్సును ఆయా రూట్‌లో తిప్పాల్సి ఉంది. ఉదయం ఎన్ని గంటల నుంచి సాయంత్రం ఎన్ని గంటల వరకు, బస్టాప్‌కు వచ్చే సమయాన్ని వారే పర్మిట్‌లో పొందుపరుస్తారు. బస్టాప్‌లో ఎక్కువ సేపు బస్సును నిలపకూడదు. ఈ పర్మిట్ కాల పరిమితి ఐదేళ్లు ఉంటుంది. బస్సును నడిపేందుకు డ్రైవరుకు కచ్చితంగా లైసెన్స్ ఉండాలి. బస్సులో కండక్టరుకు కూడా రవాణాశాఖ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదు. బస్సు ఎప్పుడూ కండిషన్‌లోనే ఉండాలి. హెవీ హారన్లను వినియోగించరాదు. ఎల్‌ఈడీ బల్బులను ఉపయోగించకూడదు. ప్రతి ఏడాది ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను పొందాల్సి ఉంటుంది. బస్సులో అగ్నిమాపక పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను ఉంచాలి. కాంట్రాక్టు క్యారేజీ కింద బస్సులను తిప్పకూడదు. ఉదాహరణకు మ్యారేజీ, ఫంక్షన్లకు ప్యాసింజర్లను తీసుకెళ్లకూడదు.

నిబంధనలు బేఖాతర్..

కార్పొరేషన్ పరిధిలో 19 రూట్లకు 39 బస్సులను తిప్పుతున్నారు. అయితే టౌన్ బస్సుల యజమానులు ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదు. ప్రధానంగా పర్మిట్ తీసుకున్న రూట్లలో కాకుండా ఇష్టానుసారంగా తిప్పుతున్నారు. మరికొన్ని బస్సులను పర్మిట్ తీసుకున్న స్టాప్ కంటే అదనంగా తిప్పుతున్న పరిస్థితి ఉంది. కొన్నింటిని కండిషన్ లేకుండానే తిప్పుతున్నారు. కొన్ని బస్సులకు రెండు వైపులా అద్దాలు లేని పరిస్థితి ఉంది. హెవీ హారన్లను వినియోగిస్తూ ఇతర వాహనాదారులు, పాదచారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. చాలా బస్సుల్లో కండక్టర్‌కు లైసెన్స్ లేకుండానే పంపిస్తున్నారు. కొన్ని బస్సుల్లో లైసెన్స్ లేకుండానే డ్రైవింగ్ చేస్తున్నారు. మితిమీరిన వేగం కూడా ఒక ప్రధాన కారణం. స్టాప్ లేకుండా ఎక్కువ సేపు ఆపుతున్నా పోలీసులు సైతం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

నిద్రమత్తులో అధికారులు

టౌన్ బస్సుల వ్యవహారంలో రవాణా అధికారులు మామూళ్లు తీసుకుని మిన్నకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పర్మిట్ లేని రూట్‌లో తిరిగితే రూ.10 వేల అపరాధ రుసుం విధించవచ్చు. పరిమితికి మించి ప్రతి ప్రయాణికుడిపై రూ.300 అపరాధ రుసుం విధించవచ్చు. అయినా వారు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. బస్సుల నుంచి వచ్చే కాలుష్యం ఎక్కువగా ఉంటుంది. నగర పరిధిలో బస్సులను తిప్పేందుకు మరో 60 రూట్లకు ఎక్కువ మొత్తంలో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. అయితే టౌన్ బస్సుల రూపంలో ఆదాయం ఎక్కువగా వస్తుండటంతోనే ఈ బాట పడుతున్నారని తెలిసింది. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్నా, కండక్టర్‌గా పనిచేస్తున్నా తనిఖీలు చేస్తున్న సందర్భాలు ఉండటం లేదు. ఒకవేళ ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహించాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నిబంధనలను అతిక్రమించి టౌన్ బస్సుల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తుప్పు పట్టి పగుళ్లు ఏర్పడిన బస్సులు

నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తాం

నిబంధనలు అతిక్రమించిన టౌన్ బస్సులను సీజ్ చేస్తాం. పర్మిట్ తీసుకున్న రూట్లలోనే బస్సులను తిప్పాలి. అంతకు మించి కొంచెం దూరం కూడా బస్సును తిప్పకూడదు. టౌన్ బస్సుల్లో డ్రైవర్లు యూనిఫాంను తప్పనిసరిగా ధరించాలి. పర్మిట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా బస్సును తిప్పకూడదు. టౌన్ బస్సులపై టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తాం. నిబంధనలు అతిక్రమించిన బస్సుల యజమానులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

– బి.చందర్, డీటీసీ

విద్యార్థులకు ముగ్గుల పోటీలు



నెల్లూరు (టౌన్) : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల కళాశాల ప్రిన్సిపల్ గిరి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వింధ్యావతి, వైస్ ప్రిన్సిపల్ రమణారావు, క్లబ్ కమిటీ సభ్యులు అనిత, నాగశ్యామల, మనోజ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు



ఉత్తర్వులు పొందిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (పొగతోట) : జిల్లా పరిషత్‌లో పనిచేస్తూ మరణించిన నలుగురికి సంబంధించి వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించారు. దానికి సంబంధించిన ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

పక్కాగా బయో వ్యర్థాల నిర్వహణ



శిక్షణ ఇస్తున్న సిబ్బంది

నెల్లూరు(అర్బన్): బయో వ్యర్థాల నిర్వహణ పక్కాగా జరగాలని దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి అడ్మినిస్ట్రేషన్ హెచ్‌ఓడీ డాక్టర్ కళారాణి సూచించారు. శుక్రవారం ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి ఎస్‌ఎస్ బయోమెడికల్ వేస్ట్ మేనేజ్ సంస్థ వారితో శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా కళారాణి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆరు రంగుల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేశామన్నారు. నలుపు, పసుపు, ఆరెంజ్, ఆకుపచ్చ ఇలా ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లో వేయాల్సిన వ్యర్థాల గురించి వివరించారు. అంతా కలిపేస్తే వాటిని తరలించే మున్సిపల్ సిబ్బందికి జబ్బులు రావడంతోపాటు గాయాలపాలవుతారన్నారు. అందువల్ల నిబంధనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్ బయోకేర్ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, ట్రైనింగ్ ఎగ్జిక్యూటివ్ పిచ్చయ్య పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరునికి ఇరుముడుల సమర్పణ




పెన్నమ్మకు హారతి ఇస్తున్న వేద పండితులు

నెల్లూరు(బృందావనం) : నగరంలో శివభక్తుల నగరోత్సవం నేత్రపర్వంగా జరిగింది. గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ సభ్యుడు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానం సన్నిధిలో వందలాది శివభక్తులు శుక్రవారం ఇరుముడులు ధరించారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలో పవిత్ర పినాకినీ నదీతీరంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత పెన్నమ్మకు హారతి ఇచ్చి దీపాలు వదిలారు. అనంతరం శివభక్తులు నగరోత్సవాన్ని చేపట్టారు. ఇలా రంగనాయకులపేట, నాలుగుకాళ్ల మండపం, ములుముడి బస్టాండ్ సెంటర్, చిన్నబజారు, పెద్దబజారు, అలంకార్ సెంటర్, బ్రాహ్మణవీధి మీదుగా మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం వద్దకు నగరోత్సవం సాగింది. అక్కడ భక్తులు ఇరుముడులు సమర్పించారు. తొలుత దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని గిరీష్‌కుమార్‌రెడ్డి ఆహ్వానించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా దేవదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈఓలు జంజం శ్రీనివాసరావు, ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి

వెంకటేశ్వరస్వామికి పుష్పయాగం



నెల్లూరు(బృందావనం) : బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి పుష్పయాగ మహోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. అర్చకుడు బృందావనం శ్రీనివాస దీక్షితులచే గణపతి స్వామికి, కల్యాణ వేంకటేశ్వరస్వామికి అభిషేక మహోత్సవం జరిపారు. భక్తులు పూలబుట్టలను వేదిక వద్దకు తీసుకొచ్చి పుష్పయాగం నిర్వహించారు. ఉభయకర్తలుగా గడ్డం శ్రీధర్‌రెడ్డి– సుజన, కర్తం ప్రతాప్‌రెడ్డి– జ్యోతి, రాఘవ సుధాకర్– కుమారి దంపతులు వ్యవహరించారు. అనంతరం లక్కీడిప్ ద్వారా 22 మంది మహిళలకు స్వామివారి చెంత ఉంచిన చీరలను అందజేశారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి

నెల్లూరు రూరల్ : జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించి ఆర్టీసీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని డీఆర్ ఉత్తమ్ హోటల్లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామీణ స్థాయిలో బస్సులు తిరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, పార్టీ నేతలు మిడతల రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజలు



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో శుక్రవారం మండల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని అయ్యప్పస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు, భిక్ష స్వీకరించారు. ఆయా కార్యక్రమాల ఉభయకర్తలుగా మండవ వెంకట శ్రీనివాస్‌నాయుడు– ధనలక్ష్మి, మల్లికార్జున్‌రావు– సుహాసిని దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్పసేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, గడ్డం విజయకుమార్, పావళ్ల ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నెల్లూరు(సెంట్రల్) : ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని 16 మందికి సీఎం సహాయనిధి చెక్కులను దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పంపిణీ చేశారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో పార్టీ సభ్యత్వ నమోదుపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 16 మందికి సంబంధించి రూ.28.90 లక్షల వరకు పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని డీఆర్‌డీఏ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొగతోట, సండే మార్కెట్, నాగుమిట్టరోడ్డు, బృందావనం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా పల్లకి ఉత్సవం



నెల్లూరు(బృందావనం) : శిరిడీలో సింహపురికి చెందిన సాయినాథుని భక్తులు శుక్రవారం పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి నగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన 400 మంది సాయిమాలధారణ భక్తులు సమూహంగా శిరిడీ వెళ్లి ఉత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, NELLORE

E.P.NO.95/2022

O.S.NO.311/2014

Cherukuru Raja S/o Chengaiah - DHR/ Plaintiff

Vs

Iska Seshamma W/o Sreenivasulu - J.D.R / Defendant

వేలం ప్రకటన

పై నెంబరున డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు జె.డి.ఆర్ తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **తే 19.12.2024** దిన ఉదయం **10.30 గంటల** నుండి సాయంత్రం 5 గంటల లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలంపాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

SCHEDULE

SPSR Nellore Registration District, Stonehousepet Sub Registration, Nellore City, Pedda Cherukuru, Patta No. 1, S.No.72 for an extent of Ac. 2.32 1/2 cents, init **15 ankanams or 100.335 Sq. mtrs** of vacant site bounded by :- **East** : site belongs to Anil Reddy, **South** : Colony, **West** : Road, **North** : Site belongs to Duvvuru Padma.

DHR Value of Rs. 2,00,000/-
Field Assistant Value of Rs. 4,50,000/-
Market Value of Rs. 2,70,000/-

U.శ్రీనివాసులు రెడ్డి, B.A., B.L.,
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలు

• కమిషనర్ సూర్యతేజ



పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగర వ్యాప్తంగా డివైడర్లపై పచ్చదనాన్ని పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. స్థానిక రంగనాయకులపేట పినాకినీ పార్కును కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. పార్కుకు అనుసంధానంగా ఉన్న పదడుగుల అప్రోచ్ రోడ్డును విస్తరించి 30 అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టాలని, రోడ్డుకిరువైపులా మొక్కలు నాటి గార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం స్థానిక సాలుచింతల ప్రాంతంలోని కరకట్ట ప్రదేశంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ఫుడ్ కోర్టు ఏర్పాటుకు అనుకూలతలను పరిశీలించి అధికారులతో చర్చించారు. తర్వాత స్థానిక మినీబైపాస్‌లోని నుడా ఎన్టీఆర్ పార్కును సందర్శించారు. అన్నీ డివైడర్లలో పచ్చదనాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా మొక్కలను, వాటి రక్షణను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతూజాని, డీసీపీ పద్మజ, ఉద్యాన శాఖ ఏడీ ప్రదీప్‌కుమార్, డీఈఈ రఘురాం, సర్వేయర్ సోమేశ్వరరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అధికారిపై చర్యలకు వినతి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : కావలిలో బీసీ అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారిగా పనిచేస్తున్న సుధాకర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొండాయపాళెం సమీపంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆదిత్యసాయి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఉల్లిపాయల మురళీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ సుధాకర్ తన వద్ద పనిచేసే ఉద్యోగులు, వార్డెన్లను వేధిస్తున్నారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. టీయూసీసీ జిల్లా కార్యదర్శి లీలామోహన్, సమాజ్‌వాది పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర నేతలు హరీష్ యాదవ్, చరణ్ గౌడ్ పాల్గొన్నారు.